క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఏపీ ఎన్జీవో భవనంలో జేవీవీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. అనంతపురం జీజీహెచ్, బళ్లారి విమ్స్ వైద్య బృందం హాజరై రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన 122 మంది యువతీయువకులకు అభినందిస్తూ జేవీవీ ప్రతినిధులు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల నాయకులు బాషా, జేవీవీ జిల్లా నాయకులు, మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, జేవీవీ రాష్ట్ర నాయకుడు గుంతి మురళీధర్, జేవీవీ నాయకులు లక్ష్మీనారాయణ, వీరణ్ణ, శ్రీరామ్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, మాంతేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

కూడేరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన కూడేరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సీఐ రాజును ఆదేశించారు. రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జల్లిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిపై, పీఏబీఆర్ డ్యాంలో బీటెక్ విద్యార్థి నీట మునిగి మృతి చెందిన కేసులపై అడిగి తెలుసుకున్నారు.

మున్సిపల్ డీఈగా పోరాళ్ల సురేష్



రాయదుర్గంటౌన్: రాయదుర్గం మున్సిపల్ డీఈగా పోరాళ్ల సురేష్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న డీఈ రవిప్రకాష్‌నాయుడు గుంతకల్లుకు బదిలీ కాగా, ఆస్థానంలో పని చేస్తున్న సురేష్‌ను రాయదుర్గానికి బదిలీ చేశారు. ఈ మేరకు డీఈ రవిప్రకాష్‌నాయుడు గురువారం రిలీవ్ అయ్యారు. శనివారం సురేష్ రాయదుర్గం మున్సిపల్ డీఈగా బాధ్యతలు చేపట్టనున్నట్లు కార్యాలయవర్గాలు తెలిపాయి. రాయదుర్గం మున్సిపల్ ఏఈ ప్రతాప్ గుంతకల్లుకు బదిలీ అయినట్లు తెలిపారు.

ఇద్దరు పిల్లలతో కలసి తల్లి అదృశ్యం

ఉరవకొండ: నియోజకవర్గ కేంద్రానికి చెందిన వివాహిత షాహినా తన కుమారుడు, కుమార్తెతో కలసి గురువారం నుంచి కనిపించకుండా పోయింది. గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ మహానంది తెలిపారు.

రోడ్డుపై ఇలా.. ప్రయాణమెలా?



జల్లిపల్లిలో పీఏబీఆర్ డ్యాంకు వెళ్లే రోడ్డుపై గుంతలు పడి వర్షం నీరు నిలిచిన దృశ్యం

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో పీఏబీఆర్ డ్యాంకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షం వచ్చిందంటే చాలు గుంతలు పడిన రోడ్డుపై నీరు నిలుస్తోంది. ఈరహదారిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినా రోడ్డు బాగు చేయడానికి చర్యలు తీసుకోలేదని స్థానికులు, వాహనదారులు అంటున్నారు.

విత్తనకాలం..నకిలీలతో జాగ్రత్త..!

- నకిలీ కంపెనీల ప్రకటనలతో మోసపోవద్దు
- ముమ్మరంగా సాగుతున్న ఖరీఫ్ వ్యవసాయ పనులు
- విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఇదే అదును
- 'గుర్తింపు' ఉంటేనే కొనాలంటున్న వ్యవసాయాధికారులు



ట్రాక్టర్‌తో పొలం పనులు చేస్తున్న రైతులు (ఫైల్)



దుకాణాల్లో విత్తన నాణ్యతపై తనిఖీలు చేస్తున్న అధికారులు (ఫైల్)

రాయదుర్గం: ఖరీఫ్ సీజన్ వచ్చేసింది.. రుతు 'పవనాలు' వీస్తున్నాయి.. వర్షాలు వచ్చేస్తున్నాయి.. 'విత్తు'కు సమయం ఆసన్నమైంది.. ఏరువాక పౌర్ణమి రానే వచ్చింది.. కాడెద్దులకు రైతులు పూజలు చేసి, పనులు ప్రారంభించారు. బీడు భూముల్లో దుక్కులు దున్నడం.. ఎరువులు చల్లడం లాంటి పనుల్లో నిమగ్నమయ్యారు..వాతావరణం అనుకూలిస్తే మరో 20 రోజుల్లో 'విత్తు' పడనుంది. ఆదిలోనే రైతులు ఎరువులు, విత్తనాలు కొను 'గోల్ మాల్' కనిపెట్టాలి. లేదంటే నకిలీ కంపెనీల ప్రకటనలతో మోసపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. గుర్తింపు పొందిన వాటినే కొనాలని చెప్తున్నారు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో ప్రధానంగా ఖరీఫ్‌లో వేరుశనగ, ఉరవకొండలో వేరుశనగ సాగుకు రైతులు శ్రీకారం చుడుతారు. ఈ ఏడాది ముందస్తు వర్షాలు ఊరించడంతో ఖరీఫ్ సాగుపై రైతులు ఆశలు పెంచుకున్నారు. దీంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనాకు వచ్చింది. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం రాయితీ విత్తనాలు అరకొరగా పంపిణీ చేసింది. రాయదుర్గం, కళ్యాణదురం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో సాధారణ సాగు విస్తీర్ణం 2,90,473 హెక్టార్లు కాగా, 1,74,179 హెక్టార్లు సాగులోకి వచ్చే అవకాశం ఉంది. మెజార్టీ సాగు వేరుశెనగ కాగ, ఆ తర్వాత కంది, ఆముదం, పత్తి, సజ్జ. ఉలువ, పొద్దు తిరుగుడు ఉంటుందని అధికారుల అంచనా. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా విత్తన వేరుశనగ 50 వేల క్వింటాళ్లు అందుబాటులో ఉంచేవారు. అయితే ఈ ఏడాది 31,512 క్వింటాళ్లు మాత్రమే నిల్వ ఉంచారు. దీంతో విత్తనాలు సరిపడక రైతులు బయట మార్కెట్లో కొంటున్నారు. కొందరు వ్యాపారులు తక్కువ ధరకు అధిక దిగుబడి వస్తుందని.. వాటినే కొనుగోలు చేయాలని రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. మభ్యపెట్టి మోసం చేసేలా వ్యవహరిస్తున్నారు. నకిలీ విత్తనాల బారిన పడి ఏటా రైతన్నలు అధిక సంఖ్యలో నష్టపోతున్నారు. కొనుగోలు సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ లైసెన్స్ పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై విక్రయదారు పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు, గ్రామం పేరు, విక్రయదారు సంతకం తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనొద్దు.
- విత్తన ప్యాకెట్, సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదో నిర్ధారించుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపర్చాలి.
- మొలకెత్తే దశ, పూత దశ పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనే ముందు..

- అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి.
- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే కొనాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో గమనించాలి.
- ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి.
- చిల్లులు పడిన, చిరిగిన ఎరువుల బస్తాలను కొనవద్దు. అన్య పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయాధికారిని సహకారంతో ఎరువులను పరీక్షించుకోవాలి.

పురుగుమందు కొనేసారి..

- వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందు కొనుగోలు చేయాలి.
- పురుగు మందు డబ్బాపై డైమాండ్ ఆకారంలో పురుగు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే ఎరుపు రంగు, విషపూరితమైతే ఆకుపచ్చ రంగు గుర్తులుంటాయి.
- పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడరాదు.
- వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి.
- పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలను ఇతర అవసరాలకు ఉపయోగించొద్దు.

నాణ్యమైన విత్తనాలు కొనాలి

విత్తనాలు, పురుగు మందు, ఎరువుల ఎంపికలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఒకవేళ నకిలీ విత్తనాలతో మోసపోతే వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించాలి. పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. విత్తనాల్లో నాణ్యత లేక దిగుబడి కోల్పోయినట్లు గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై వ్యవసాయాధికారి ద్వారా జిల్లా అధికారికి ఫిర్యాదు చేయించి తగిన పరిహారం పొందొచ్చు. రైతులు సంబంధిత బిల్లులను భద్రంగా ఉంచుకోవాలి.

– లక్ష్మానాయక్, ఏడీఏ, రాయదుర్గం

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



కృష్ణమూర్తి మృతదేహాదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

బ్రహ్మసముద్రం : అధైర్యపడొద్దు..అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి కార్యకర్తల కుటుంబాలకు భరోసా ఇచ్చారు. గురువారం మండల పరిధిలోని గుడిపల్లికి చెందిన సీనియర్ నాయకుడు కృష్ణమూర్తి (62), అదే గ్రామానికి చెందిన కార్యకర్త శివకుమార్ (25) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందారు. నాయకులు గుడిపల్లి గ్రామానికి వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ భాద పల్లప్ప, మాజీ ఎంపీపీ మహదేవప్ప, సర్పంచులు తలారి గోవిందప్ప, మల్లేష్, మాజీ సర్పంచ్ వడ్డే వెంకటేశులు, నాయకులు నటరాజ్, గజేంద్ర, జనార్దన, తదితరులు నివాళులర్పించారు.

బాలుర వసతి గృహం వార్డెన్‌గా ఆదినారాయణ

కూడేరు: స్థానిక బాలుర వసతి గృహం వార్డెన్‌గా ఆదినారాయణ నియమితులయ్యారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన పామిడి మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న వార్డెన్ గురుప్రసాద్ చుక్కలూరుకు బదిలీపై వెళ్లారు.

రెవెన్యూ అధికారులు బదిలీ

కూడేరు: మండల రెవెన్యూ శాఖలో పని చేస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. డీటీ సూర్యప్రతాప్ శింగనమల మండలానికి, ఆర్ఐ నగేష్ బాబు బెలుగుప్ప మండలానికి, ఇన్‌చార్జ్ సీఎస్ డీటీ లక్ష్మీదేవికి ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పించారు.

సంక్షిప్త సమాచారం

విమాన ప్రమాదంపై రంగయ్య దిగ్భ్రాంతి

కళ్యాణదుర్గం: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంపై మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. విమాన ప్రమాదంలో 200 మందికి పైగా ప్రయాణికులు మృతి చెందడం బాధాకరమన్నారు. ప్రమాదంలో మాజీ సీఎం విజయ్ రూపాని మరణించడం కలిచివేసిందన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కణేకల్లు అగ్రికల్చర్‌ఫాం ఏఓగా మహేష్



కణేకల్లు: కణేకల్లు అగ్రికల్చర్‌ఫాం ఏఓగా మహేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కుందర్పిలో ఏఓగా పని చేస్తున్న మహేష్‌ను కణేకల్లు అగ్రికల్చర్‌ఫాంకు బదిలీ చేశారు. దీంతో ఆయన ఏడీఏ నారాయణనాయక్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణానికి చెందిన మతిస్థిమితం లేని తలారి నాగేంద్ర అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. పట్టణంలోని శెట్టూరు రోడ్డు సమీపంలో కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అతను తిరిగి ఇంటికి రాలేదు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. నాగేంద్ర ఆచూకీ తెలిస్తే సెల్: 9849363499,8555900502 సమాచారం ఇవ్వాలని పట్టణ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

రాయదుర్గంటౌన్: మండలంలోని 74 ఉడేగోళం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరెడ్డిపల్లికి చెందిన శశికుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతోనే ప్రమాదం జరిగింది. అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఓటర్ల నమోదు సక్రమంగా ఉండాలి

రాయదుర్గంటౌన్: ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు సక్రమంగా పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఈఆర్ఓ రవిశంకర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు, మార్పులపై అభ్యంతరాలు ఉంటే తెలుపాలన్నారు. డబుల్ ఎంట్రీలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ నాగరాజు, ఈడీటీ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయకపోతే ఫంక్షన్ హాలుకు తాళాలు వేస్తాం



మాట్లాడుతున్న వేర్‌హౌస్ యజమాని బాధితులు

కణేకల్లు: కేసీఎస్ఆర్ ఫంక్షన్‌హాలు, వేర్‌హౌస్ యజమాని నరేంద్ర తమ పేరుపై తీసుకున్న అప్పులు చెల్లించేలా చేయాలని, లేనిపక్షంలో వేర్‌హౌస్‌కు తాళాలేసి స్వాధీనం చేసుకుంటామని బాధితులు హెచ్చరించారు. స్థానిక కేసీఎస్ఆర్ ఫంక్షన్‌హాలు వద్ద గురువారం బాధితులు టీ.కేశవరెడ్డి, రహీం, సాధత్, వై.చంద్రమోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, గాంధీ, బక్షీ, నాగిరెడ్డితోపాటు పలువురు విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర ఏడేళ్ల క్రితం వేర్‌హౌస్‌లో ఉన్న ఉత్పత్తులపై కర్ణాటక బ్యాంకు, కణేకల్లు, బొమ్మనహాళ్ యూనియన్ బ్యాంకుల్లో 42 మంది రైతుల పట్టాదారు పాసు పుస్తకాలు తనఖాపెట్టి, రుణం పొందాడన్నారు. తీసుకున్న రుణం చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ కలిసి తడిసి మోపిడైతే, రెండేళ్లక్రితం బ్యాంకర్లు 40 శాతం లెస్‌కు సెటిల్‌మెంట్ చేశారని, దానికి ఒప్పుకున్న అతను.. ఇప్పటికీ కాలయాపన చేస్తున్నాడన్నారు. ఈ మేరకు బాధితులు కణేకల్లు పోలీసు స్టేషన్‌లో జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు.

పంట పరిహారమేదీ?

కుందుర్పి: మండల వ్యాప్తంగా అడవి జంతువుల దాడుల్లో ధ్వంసమైన పంటలకు పరిహారం పంపిణీ చేయలేదని జంబుగుంపల,కెంచంపల్లి,బెస్తరపల్లి,కొలిమిపాళ్యం తదితర గ్రామాల రైతులు అంటున్నారు. జంబుగుంపల, బెస్తరపల్లి అడవుల పరిసర గ్రామాల్లో చీకటి పడితే అడవి పందులు, ఎలుగు బంట్లు, జింకలు పొలాల్లో చొరబడి వేరుశనగ, కర్బూజా, కళింగర, జామ, చీనీ పంటలు ధ్వంసం చేస్తున్నాయి. 130 ఎకరాల్లో వేరుశనగ తదితర పండ్ల తోటలను ధ్వంసమయ్యాయి. అటవీశాఖ, వ్యవసాయ, రెవెన్యూ, వెటర్నరీ అధికారులు నివేదిక పంపినా పరిహారం అందలేదని రైతులు రామచంద్ర, రవి, పాల మ్మ, అంజనమ్మ, రామాంజనేయులు తెలిపారు.

అడుగడుగునా హారతులు





రాళ్ల అనంతపురంలో సాగుతున్న పాదయాత్ర , రాళ్లపల్లి గ్రామంలో మహిళలతో ఆర్డీటీ సేవలపై ఆరా తీస్తున్న తలారి రంగయ్య

- ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు స్వచ్ఛందంగా కదిలిన అన్నివర్గాల వారు
- ఊరూరా హోరెత్తిన సేవ్ ఆర్డీటీ నినాదాలు

కళ్యాణదుర్గం: ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ సాధన కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తున్నారు. గురువారం కంబదూరు మండలం అండేపల్లిలో 9వ రోజు పాదయాత్ర ప్రారంభమైంది. మంద, కుర్లపల్లి, మేళ్లకుంట, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం వరకు పాదయాత్ర సాగింది. పాదయాత్ర సందర్భంగా గ్రామ గ్రామానా మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. దారి పొడవునా మహిళలు, కూలీలతో ఆర్డీటీ సేవలు ఆగిపోతే జరిగే నష్టాలను వారికి తెలియజేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే ఆర్డీటీని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని వివరించారు. పాదయాత్రలో మహిళలు సేవ్ ఆర్డీటీ ప్లకార్డులను పట్టుకుని సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు హోరెత్తించారు. కుర్లపల్లి వద్ద కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కౌన్సిలర్లు సుధీర్, పార్టీ అధికార ప్రతినిధి గోపారం శ్రీనివాసులు, తిరుమల వెంకటేశులు, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, కోఆప్షన్ అఫ్జల్, చరణ్, షేక్షావలి, నాగరాజు, రమేష్, జాకీర్‌లు ఘన సన్మానం చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీ లక్ష్మిదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మరాయుడు, భీమేష్, వివిధ అనుబంధ సంఘాల నాయకులు ఆదెప్ప, నీలిశంకరప్ప, బయన్న, డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మయ్య, కిరణ్, దాదు, ఫయాజ్, పాతలింగ, మీ సేవ కుమార్, మాజీ కన్వీనర్ బాలరాజు, ఎంపీటీసీలు మల్లేశు, భాస్కర్, లింగమూర్తి, సోము, శ్యామంతరెడ్డి, సర్పంచులు అమర్, గంగాధర, చంద్ర, రాజగోపాల్, పరంధామరెడ్డి, అండేపల్లి రమేష్, రామాంజనేయులు, కేశవులు, వెంకటప్ప, కుమ్మర గంగాధర, మార్కు, ప్రసాద్, దాసన్న, పరమేష్, గంగాధర్, కుర్లపల్లి నాగరాజు, ధనుష్, మేళ్లకుంట తిమ్మరాజు, రాళ్లపల్లి గంగాధర, మారెన్న, రవీంద్రరెడ్డి, మహారాజ, వన్నప్ప, తిప్పేస్వామి, అక్కులప్ప, ఎరుకుల పెద్దన్న, బోయ సురేష్, రాజన్న, రాళ్ల అనంతపురం రవి, శర్మాస్, మాజీ ఎంపీటీసీ ఫక్రుద్దీన్, వెంకటేశులు, ముత్యాలప్ప, లక్ష్మీనారాయణ, శీనప్పలతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాదయాత్రకు మద్దతు తెలిపిన గుంతకల్లు నేతలు..

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం మాజీ ఎంపీ తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు గురువారం గుంతకల్లు మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్.రామలింగప్ప, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.గిడ్డలింగేశ్వరబాబు (చిన్నబాబు), నాయకులు సుంకప్ప, లింగన్న, హనుమేష్, సుమో బాషా, వాల్మీకి శివ, రాజేష్‌లతో పాటు పలువురు సంఘీభావం తెలిపారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి కట్టుబడి తానీషా, దాసిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు పాదయాత్రకు మద్దతు తెలిపారు.

పాదయాత్రకు ప్రముఖుల సంఘీభావం

మాజీ ఎంపీ, పీఏసీ సభ్యుడు డాక్టర్ తలారి రంగయ్య చేస్తున్న ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రకు పలువురు ప్రముఖులు సంఘీభావం తెలిపారు. గురువారం కంబదూరు మండలం రాళ్ల అనంతపురం గ్రామంలో పాదయాత్ర అనంతరం మానవతా రక్తదాతల సంస్థ అధినేత అమర్‌నాథ్‌రెడ్డి, సలీం, మానవహక్కుల సంఘం నేత బాషా, జేవీవీ జిల్లా నాయకులు తిరుపాల్ మద్దతు తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం పాదయాత్ర చేయడం ఎంతో గొప్ప విషయని తలారి రంగయ్యను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, ఎంపీపీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగరాజు, తిప్పేస్వామి, పాతలింగ తదితరులు పాల్గొన్నారు.



రంగయ్యతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పార్టీ నేతలు తిప్పేస్వామి, ఉమా



పాదయాత్రకు మద్దతు తెలిపిన గుంతకల్లు నేతలు



సంఘీభావం తెలుపుతున్న అమరనాథరెడ్డి తదితరులు

కుండపోత వర్షం



వర్షానికి నీట మునిగిన వేరుశనగ పంట

- పొంగి ప్రవహించిన వంకలు వాగులు
- కణేకల్లులో 59 ఎంఎం నమోదు

కణేకల్లు: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. కణేకల్లు, మాల్యం, సొల్లాపురం, కోకుర్తి తదితర గ్రామాల్లో కుండపోత (59 ఎంఎంగా) వర్షం కురిసింది. వేదవతి హగిరితోపాటు సొల్లాపురం, హన కనహాళ్, సొల్లాపురం, మీన్లహళ్లి వంకలు, వాగులు పొంగి ప్రవహించాయి. వేదవతి హగిరిలో ఉధృత స్థాయిలో వరదనీరు ప్రవహిస్తుండటంతో వేదవతి హగిరి మీదుగా రాకపోకలు నిలిచిపోయాయి. మాల్యం–దర్గాహోన్నూరు మార్గమధ్యంలో మీన్లహళ్లి వద్ద ఉన్న వంకకు భారీగా వరద నీరు రావడంతో కల్వర్టు కోతకు గురైంది. గురువారం సాయంత్రం వరకు బస్సులు, వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు జేసీబీతో రెడ్‌గ్రావెల్ వేసి పూడ్చారు. ఉరవకొండ నుంచి కణేకల్లు వచ్చే 33/11 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

154.2 మిల్లీమీటర్ల వర్షపాతం

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కణేకల్లులో 59 మిల్లీమీటర్లు, డి.హీరేహాళ్‌లో 40 మిల్లీమీటర్లు, రాయదుర్గంలో 20.4 మిల్లీమీటర్లు, గుమ్మఘట్టలో 14.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురవగా, నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 154 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గుమ్మఘట్ట: మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి తేలికపాటి వర్షం కురిసింది.14.8 మి.మీటర్ల వర్షాపాతం నమోదైంది. రాత్రంతా చిరుజల్లులు పడ్డాయి.

ఉరవకొండ రూరల్: నియోజకవర్గంలో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకూ భారీ వర్షం కురుసింది. దీంతో వాగులు వంకలూ, చెరువులు పొంగి పొర్లాయి. ఉరవకొండ నుంచి పొల్కూరు, హొన్నూరు మీదుగా బస్సు రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

నీటమునిగిన పత్తి, వేరుశనగ పంటలు

బొమ్మనహాళ్: మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పత్తి, వేరుశనగ , మొక్కజొన్న రైతులు నష్టపోయారు. మండలంలోని కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కొలగానహళ్లి గ్రామం వద్ద కబ్బాలి వంకకు భారీగా వరద నీరు రావడంతో పొంగిపొర్లుతుంది. గాలీవానకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగిపోయాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గోవిందవాడ పరిధిలోని ఇసుక దిబ్బల్లో సాగు చేసిన వేరుశనగ పంట దాదాపు 70 ఎకరాల పంట నష్టం జరిగిందని రైతులు తెలిపారు. లింగదహాళ్, రంగాపురం క్యాంపు, ఉప్పరహాళ్, సింగనహళ్లి తదితర గ్రామాల్లో పత్తి పంట నీట మునిగింది.

బెళుగుప్ప:మండలంలోని గ్రామాల్లో బుధవారం రాత్రి మొత్తం కురిసిన జడివానకు కూరగాయల పంటలైన పందిరి కింద సాగు చేసిన బీర పంటల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఒక్కరాత్రి కురిసిన వర్షపాతమే 36.4 ఎంఎంగా నమోదు కాబడిందని ఏఓ పృథ్వీసాగర్ పేర్కొన్నారు. బెళుగుప్ప, ఆవులెన్న, బెళుగుప్ప తండా, నక్కలపల్లి తదితర గ్రామాల్లో సుమారు 40 ఎకరాల్లోని బీర పంటలు తీవ్రంగా నష్టపోయారు. పందిరి మొత్తం నేలవాలి కోతలే లేకుండా పోయాయని రైతులు శ్రీకాంత్, వీరమ్మ, ప్రకాశ్, నరేష్, తిప్పయ్య, తిప్పారెడ్డి, లక్ష్మినారాయణ, మనోహర్ ,శ్రీకాంత్, సత్యనారాయణ తదితరులు వాపోయారు.



మీన్లహళ్లి వద్ద కోతకు గురైన వంక



గోవిందవాడ వద్ద నీట మునిగిన వేరుశనగ పంటను చూపుతున్న రైతులు



ఆవులెన్న సమీపంలో నేలవాలిన పందిరి కింద సాగైన బీర పంట

పారదర్శకంగా ఉపాధి పనులు కల్పించాలి

కుందుర్పి: మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పనుల కల్పనలో పారదర్శకత పాటించాలని ఎంపీపీ కమలమ్మ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ హనుమంతరాయుడు తదితరులు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. జంబుగుంపల, కుందుర్పి, మలయనూరు, కరిగానిపల్లి తదితర పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే సాకుతో కూలీలకు ఏడాదిగా పనులు కల్పించలేదన్నారు. డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం ఎంపికలోనూ వివక్ష చూపారన్నారు. పనులు కల్పించాలని కోరితే వైఎస్సార్‌సీపీ మద్దతుదారులనే ముద్ర వేస్తున్నారని, కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు తెగేసి చెప్పున్నారన్నారు. పనుల కల్పనలో ఎంపీడీఓ, ఏపీఓ చొరవతీసుకొని గ్రామాల్లో పార్టీలకతీతంగా ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో అర్హులైన కూలీలతో ఆందోళనలు చేపడతామన్నారు.

CHANGE OF NAME

I, KUMMATHI CHANDRASEKHARA REDDY (old Name) S/o Kummathi Thippaiah, R/o 6-648, Ramanagar, Main Road, Kanekal, Anantapur (D), AP. I changed my name to **KUMMATHI CHANDRASEKHAR REDDY.** Hence forth, I will be known as **KUMMATHI CHANDRASEKHAR REDDY** S/o Kummathi Thippaiah for all purpose.